క్లుప్తంగా

'సుంకేసుల'కు కొనసాగుతున్న ఇన్‌ఫ్లో

గూడూరు: సుంకేసుల రిజర్వాయర్‌కు ఎగువ నుంచి నీటి ప్రవాహం కొనసాగుతోంది. శుక్రవారం 790 క్యూసెక్కుల ఇన్ ఫ్లో ఉండగా కేసీ కాల్వకు 1,255 క్యూ సెక్కుల నీరు విడుదల చేశామని డ్యాం అధికారులు తెలిపారు. ప్రస్తుతం జలాశయంలో 0.845 టీఎంసీల నీరు నిల్వ ఉన్నట్లు వారు వెల్లడించారు.

నేడు జగన్నాథగట్టుకు ప్రత్యేక బస్సులు

కర్నూలు(రాజ్‌విహార్): మహాశివరాత్రి సందర్భంగా జగన్నాథగట్టుకు ప్రత్యేక బస్సులు నడపనున్నట్లు ప్రజా రవాణ శాఖ కర్నూలు–2 డిపో మేనేజరు సర్దార్ హుసేన్ శుక్రవారం ఒక ప్రకటనలో తెలిపారు. శనివారం ఉదయం 6 నుంచి అర్ధరాత్రి 12గంటల వరకు ప్రయాణికుల రద్దీ మేరకు కర్నూలు కొత్త బస్టాండ్, పాత బస్టాండ్ నుంచి నడుపుతామని, ఇందులో చార్జీ రూ.30, సీ.క్యాంప్ నుంచి రూ.20 ఉంటుందని, వీటిని భక్తులు సద్వినియోగం చేసుకోవాలని కోరారు.

పక్కాగా భూ రీ సర్వే

కర్నూలు (న్యూటౌన్): మండలంలోని 21 రెవెన్యూ గ్రామాల్లో భూ రీసర్వే కొనసాగుతోంది. మండలంలో మొత్తం 82,632 ఎకరాల భూమి ఉండగా శుక్రవారం నాటికి 63610.30 ఎకరాల్లో రీ సర్వే పూర్తయినట్లు కర్నూలు రూరల్ ఇన్‌చార్జ్ తహసీల్దార్ శివరాముడు తెలిపారు. ఈ సందర్భంగా ఆయన విలేకరులతో మాట్లాడుతూ భవిష్యత్‌లో భూవివాదాలకు తావులేకుండా రీ సర్వే పక్కాగా చేస్తున్నామన్నారు. రీ సర్వేపై ముందుగానే గ్రామాల్లో దండోరా వేయించి రైతులకు సమాచారం అందిస్తున్నామన్నారు.

గర్భిణులకు వైద్యపరీక్షలు

కోడుమూరు రూరల్: పట్టణంలో 8 అంగన్‌వాడీ సెంటర్లు, వర్కూరులోని 3 అంగన్‌వాడీ సెంటర్ల పరిధిలో గల 36 మంది గర్భిణులకు శుక్రవారం స్థానిక పీహెచ్‌సీలో వైద్య పరీక్షలు నిర్వహించారు. ప్రభుత్వం అమలు చేస్తున్న వైఎస్సార్ సంపూర్ణ పోషణ, 1000 రోజుల సంరక్షణపై అవగాహన కల్పించడంతో పాటు రక్త హీనతతో బాధపడుతున్న వారికి ఐరన్, క్యాల్షియం మాత్రలు అందజేసినట్లు ఐసీడీఎస్ సూపర్‌వైజర్ రాజమ్మ తెలిపారు.

ఎన్నికల విధులు సక్రమంగా నిర్వర్తించాలి

సి.బెళగల్: ఎమ్మెల్సీ ఎన్నికలకు సంబంధించిన విధులను రెవెన్యూ అధికారులు సక్రమంగా నిర్వర్తించాలని తహసీల్దార్ శివశంకర్ నాయక్ అన్నారు. శుక్రవారం ఆయన తన కార్యాలయంలో డీటీ సరళతో కలిసి మండల వీఆర్వోలతో సమావేశం నిర్వహించి మాట్లాడారు. ఎన్నికల కోడ్‌ను పకడ్బందీగా అమలు చేయాలన్నారు. అలాగే రాజకీయ పార్టీల కార్యక్రమాలకు దూరంగా ఉండాలన్నారు. అలాగే ఎన్నిల కోడ్ అమలు (ఎంసీసీ), ఫ్లయింగ్ స్క్వాడ్ టీమ్ (ఎఫ్ఎస్‌టీ)గా మండల అధికారులను మూడు బృందాలుగా ఎంపిక చేసినట్లు తెలిపారు.

ప్రతి రోజు స్పందన నిర్వహించండి



చిందుకూరు సచివాలయంలో రికార్డులను పరిశీలిస్తున్న ఎంపీడీఓ

గడివేముల: గ్రామ సచివాలయాల్లో ప్రతి రోజు మధ్యాహ్నం నుంచి స్పందన కార్యక్రమం నిర్వహించాలని ఎంపీడీఓ విజయసింహారెడ్డి సచివాలయ ఉద్యోగులకు సూచించారు. శుక్రవారం మండల పరిధిలోని చిందుకూరు సచివాలయాన్ని తనిఖీ చేసి వలంటీర్లతో సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా ఎంపీడీఓ మాట్లాడుతూ మధ్యాహ్నం 3 గంటల నుంచి సాయంత్రం 5 గంటలకు ప్రజలకు, రైతులకు అందుబాటులో ఉండాలన్నారు. స్పందన కార్యక్రమంలో వచ్చిన ప్రతి అర్జీ పరిష్కారానికి చర్యలు తీసుకోవాలని, ఈ విషయంలో నిర్లక్ష్యం వహిస్తే కఠిన చర్యలు తప్పవన్నారు. ప్రజారోగ్యాన్ని దృష్టిలో ఉంచుకుని గ్రామాల్లో ఎప్పటికప్పుడు పారిశుద్ధ్య పనులు చేపట్టాలన్నారు.

గొడవలకు దూరంగా ఉండండి



పల్లెనిద్ర కార్యక్రమంలో మాట్లాడుతున్న ఎస్‌ఐ పీరయ్య

సి.బెళగల్: గొడవలకు దూరంగా ఉండి ప్రశాంత జీవనం గడపాలని ఎస్‌ఐ పీరయ్య ప్రజలకు సూచించారు. శుక్రవారం రాత్రి సి.బెళగల్ మండలం ఈర్లదిన్నె గ్రామంలో పోలీస్ సిబ్బందితో కలిసి ఎస్‌ఐ పల్లెనిద్ర కార్యక్రమం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన పాత నేరస్తులు, రౌడీషీటర్లు, వివిధ కేసుల్లో అనుమానితులతో మాట్లాడారు.సత్ప్రవర్తనతో మెలగాలని సూచించారు. అలాగే గ్రామీణ ప్రజలకు వివిధ చట్టాలపై అవగాహన కల్పించారు.



మహా శివరాత్రి ఉత్సవాలకు ముస్తాబైన గడిగరేవుల భోగేశ్వరాలయం

ఉత్సవ శోభ



పందిపాడులో పూజలందుకుంటున్న శివలింగం

మహాశివరాత్రి ఉత్సవాలకు కోడుమూరు, పాణ్యం నియోజకవర్గాల పరిధిలోని శైవాలయాలు ముస్తాబయ్యాయి. రంగురంగు విద్యుత్ దీపాలు, మామిడి తోరణాలు, అరటి బోదెలు, టెంకాయ మట్టలతో ఉత్సవ శోభను సంతరించుకున్నాయి. నేడు (శనివారం) శివరాత్రి పర్వదినాన్ని పురస్కరించుకుని భక్తుల జాగరణ, లింగోద్భవ ఘట్టం, శివపార్వతుల కల్యాణం, గ్రామోత్సవం నిర్వహణకు ఆలయాల వద్ద పకడ్బందీ ఏర్పాట్లు చేశారు.

–గడివేముల/కల్లూరు

కాల్వబుగ్గలో మహాశివరాత్రి బ్రహ్మోత్సవాలు షురూ

- 20న బుగ్గరామేశ్వరస్వామి రథోత్సవం
- పకడ్బందీ ఏర్పాట్లు చేసిన అధికారులు

ఓర్వకల్లు: మండలంలోని కాల్వబుగ్గ దేవస్థానంలో వారం రోజులు పాటు జరిగే మహా శివరాత్రి బ్రహ్మోత్సవాలు శుక్రవారం ప్రారంభమయ్యాయి. సాయంత్రం కాల్వ గ్రామం నుంచి బుగ్గరామేశ్వరస్వామి వరప్రయాణం చేయనున్నారు. 18 వ తేదీన ఉదయం మహా శివరాత్రి జాగారణకు అంకురార్పన చేస్తారు. మధ్యాహ్నం బుగ్గరామేశ్వరస్వామి, భ్రమరాంబాదేవికి పంచామృతాభిషేకం, రాత్రి స్వాముల వారికి యమాభిషేకం, తెల్లవారు జామున స్వామి, అమ్మవార్లకు కల్యాణోత్సవం జరిపిస్తారు. 19 వ తేదీన ఉదయం 11 గంటలకు సింహవాహన సేవ, నందివాహన సేవలు నిర్వహిస్తారు. సాయంత్రం ప్రభోత్సవం ఉంటుంది. 20 వ తేదీన సాయంత్రం 5 గంటలకు స్వామి రథోత్సవం, 21న వసంతోత్సవం, పారువేట జరుగుతుంది. 22న స్వాముల వారి ఉత్సవ విగ్రహాలు కాల్వ గ్రామానికి తిరగు ప్రయాణంతో ఉత్సవాలు ముగుస్తాయని ఆలయ ట్రస్టుబోర్డు చైర్మన్ గుర్రాల చెన్నారెడ్డి, ఈఓ డీఆర్‌కేవీ ప్రసాద్ తెలిపారు.

పకడ్బందీ ఏర్పాట్లు

వారం రోజుల పాటు జరిగే కాల్వబుగ్గ బ్రహ్మోత్సవాలకు ఆలయాధికారులు పకడ్బందీ ఏర్పాటు చేశారు. భారీగా తరలివచ్చే భక్తుల కోసం ప్రత్యేక ఏర్పాట్లు చేశారు. చలువ పందిర్లు, క్యూలైన్లు, విద్యుత్, తాగునీటి తదితర వసతులు కల్పించారు. ఆలయ ముఖద్వారంలో ఉన్న ప్రదాన రాజగోపురాన్ని విద్యుత్ దీపాలతో అలంకరించారు. సాంస్కృతిక ప్రదర్శనల నిర్వహణ కోసం నూతనంగా వేదికను నిర్మించారు.

20న నాగేశ్వరస్వామి రథోత్సవం

నన్నూరులోని భవానీ సమేత నాగేశ్వరస్వామి ఆలయంలో శనివారం నుంచి శివరాత్రి వేడుకలు ప్రారంభమవుతున్నాయి. 18 న గణపతి పూజ, స్వామి, అమ్మవార్ల కల్యాణోత్సవం, 19 న ప్రభోత్సవం, 20న రథోత్సవం, 21న పారువేట నిర్వహిస్తామని ఆలయ ట్రస్టుబోర్డు చైర్మన్ పద్మావతమ్మ తెలిపారు.



విద్యుత్ దీపాల అలంకరణలో బుగ్గరామేశ్వరాలయం

బ్రహ్మోత్సవాలను విజయవంతం చేయండి



కాల్వబుగ్గలో ఏర్పాట్లను పరిశీలిస్తున్న ఎమ్మెల్యే కాటసాని రాంభూపాల్‌రెడ్డి

ఓర్వకల్లు: వివిధ శాఖలకు చెందిన అధికారులు సమన్వయంతో పనిచేసి కాల్వబుగ్గలో మహాశివ రాత్రి బ్రహ్మోత్సవాలను విజయవంతం చేయాలని ఎమ్మెల్యే కాటసాని రాంభూపాల్‌రెడ్డి ఆదేశించారు. శుక్ర వారం ఆయన బుగ్గరామేశ్వరస్వామిని దర్శించుకుని ప్రత్యేక పూజలు చేశారు. అనంతరం ఆలయ ప్రాంగణంలో చేపట్టిన ఉత్సవ ఏర్పాట్లను పరిశీలించి మా ట్లాడారు. మహాశివరాత్రి బ్రహ్మోత్సవాలను తిలకించేందుకు భక్తులు అధిక సంఖ్యలో తరలివస్తారన్నా రు. వారికి ఎలాంటి ఇబ్బందులు తలెత్తకుండా అన్ని వసతులు సమకూర్చాలని చెప్పారు. ప్రధానంగా మహిళ భక్తులకు అసౌకర్యం కలగకుండా చూడాలన్నారు. భారీ సినీ సంగీత విభావరి నిర్వహిస్తున్న సమయంలో తొక్కిసలాటలు, అల్లర్లు జరగకుండా పోలీసుల సహకారంతో పటిష్ట బందోబస్తు ఏర్పాటు చేయాలని ఆలయాధికారులకు ఆదేశించారు. అలా గే ప్రధాన రహదారిలో వాహనాల రాకపోకలకు అంతరాయం కలగకుండా చర్యలు తీసుకోవాలన్నారు. కార్యక్రమంలో ఆలయ ట్రస్టుబోర్డు చైర్మన్ గుర్రాల చెన్నారెడ్డి, ఈఓ డీఆర్‌కేవీ ప్రసాద్, ఆలయ అర్చకు లు కళ్లె లక్ష్మీనారాయణశర్మ, సింగిల్ విండో చైర్మన్ నాగతిరుపాలు,నాయకులు జీకే వెంగన్న, గోపా రమణారెడ్డి, ధర్మకర్త మండలి సభ్యులు పాల్గొన్నారు.

నేడు గుడిపాడు, చనుగొండ్లలో ప్రభోత్సవం

గూడూరు రూరల్: మండల పరిధిలోని గుడిపాడులో శ్రీ రామలింగేశ్వరస్వామి జాతరలో భాగంగా శనివారం రాత్రి ప్రభోత్సవం, శివపార్వతుల కల్యాణోత్సవ కార్యక్రమాలు నిర్వహించనున్నారు. అలాగే చనుగొండ్లలో శ్రీ నాగలింగేశ్వరస్వామి జాతరలో భాగంగా స్వామి వారికి అభిషేకాలు, కల్యాణం, ప్రభోత్సవం చేపట్టనున్నారు.

- **పాణ్యం:** శ్రీ పాణికేశ్వరస్వామి ఆలయంలో ఈనెల 18నుంచి 20వ తేదీ వరకు మూడు రోజుల పాటు వేడుకలు జరుగుతాయి. 18న స్వామి కల్యాణం, 19న అభిషేకాలు, 20వ తేదీన మధ్యాహ్నం అన్నదానం, సాయంత్రం 'రేలారె రేలా'జానపదగీతాలాపన కార్యక్రమం ఉంటుందన్నారు.
- **కోడుమూరు రూరల్:** వర్కూరు శ్రీసిద్దేశ్వరస్వామి ఆలయంలో శివరాత్రి ఉత్సవాల్లో భాగంగా ఆదివారం స్వామి అమ్మవార్ల కల్యాణం నిర్వహించనున్నారు. అలాగే ప్యాలకుర్తిలో శ్రీభీమలింగేశ్వర స్వామి, కోడుమూరులో శ్రీనీలకంఠేశ్వర దేవాలయం, కోటవీధిలో శ్రీభీమలింగేశ్వరస్వామి, గుంత శివాలయం, ఈశ్వరాలయాల్లో శివరాత్రి వేడుకలను ఘనంగా నిర్వహించేందుకు నిర్వాహకులు ఏర్పాట్లు చేశారు.

వైభవంగా నంది విగ్రహ ప్రతిష్ఠోత్సవం

పాణ్యం: మండల కేంద్రం పాణ్యంలోని శ్రీ భవాని సమేత శ్రీ భృంగీశ్వరస్వామి ఆలయంలో నంది విగ్రహ ప్రతిష్ఠోత్సవం వైభవంగా జరిగింది. రెండో రోజు శుక్రవారం అర్చకులు విశిష్టపూజలు చేశారు. ఈ కార్యక్రమానికి ఎమ్మెల్యే కాటసాని రాంభూపాల్‌రెడ్డి హాజరై పరమశివునికి జలాభిషేకం, కలశపూజ , మంగళహారతి నిర్వహించారు. అనంతరం నంది విగ్రహ ప్రతిష్ఠ పూజల్లో పాల్గొని మాట్లాడారు. ఎంతో చరిత్ర కలిగిన భృంగీశ్వర స్వామి ఆలయాన్ని అన్ని విధాలుగా అభివృద్ధి చేస్తానన్నారు. భక్తులకు అవసరమైన సౌకర్యాలు కల్పిస్తామన్నారు. ప్రస్తుతం శ్రీవీరనారాయణ స్వామి ఆలయానికి వచ్చే భక్తులు పక్కనే ఉన్న శ్రీ భృంగీశ్వరస్వామికి వచ్చి పూజలు చేసుకుంటున్నారన్నారు. అనంతరం ఎమ్మెల్యే పాణ్యం గ్రామంలో జరిగిన పలు వివాహాలకు హాజరై నూతన వధువరులను ఆశీర్వదించారు. ఆయా కార్యక్రమాల్లో నాయకులు కరుణాకర్‌రెడ్డి, పాణ్యం ఉప సర్పంచ్ పాలం చంద్రశేఖర్‌రెడ్డి, మాజీ సర్పంచ్‌లు సుబ్బరాయుడు, పుల్లయ్య, బాబు, మాజీ ఆలయ చైర్మన్లు రాజనాల సుధాకర్, శంకర్‌గౌడ్, కో–ఆప్షన్ సభ్యులు జాకీర్ ఉసేన్, ఎల్లకిట్టు, వెంకటేశ్వర్లు, లక్ష్మీరెడ్డి, నారాయణ, టైలర్‌బాషా, పిన్నాపురం సర్పంచ్ ఎల్లక్రిష్టయ్య, మహేంద్రారెడ్డి , వెంకట సుబ్బయ్య, గౌడ్, ఆటోమాబు, తదితరులు పాల్గొన్నారు.



నూతనంగా ప్రతిష్ఠించిన నందివిగ్రహం

అభివృద్ధి పనుల్లో వేగం పెంచాలి

కర్నూలు (టౌన్): నగరంలో రూ.కోట్లు వెచ్చించి చేపడుతున్న అభివృద్ధి పనుల్లో మరింత వేగం పెంచాలని నగరపాలక కమిషనర్ భార్గవ్‌తేజ అన్నారు. శుక్రవారం కమిషనర్ నగరంలోని వివిధ ప్రాంతాల్లో పర్యటించారు. స్థానిక హంద్రీ బ్రిడ్జి వద్ద, బిర్లాగేట్ వద్ద రూ.2 కోట్లతో ఏర్పాటు చేస్తున్న ఈట్ స్ట్రీట్ పనులు, పాతబస్టాండ్ కొండారెడ్డి బురుజు వద్ద రూ.2 కోట్లతో చేపడుతున్న పనులు, రాజ్‌విహార్ వద్ద డివైడర్ పనులు, వెంకటరమణ కాలనీ, గుత్తి పెట్రోల్ బంకు సమీపంలో చేపడుతున్న అభివృద్ధి పనులను పరిశీలించారు. త్వరితగతిన పనులు పూర్తి చేయాలని అధికారులకు సూచించారు. కార్యక్రమంలో మున్సిపల్ ఎస్ఈ శేషాసాయి, ఈఈ షాకీర్ అహమ్మద్ తదితరులు పాల్గొన్నారు.

రేపు సాంఘిక నాటకాల ప్రదర్శన

కర్నూలు కల్చరల్: టీజీవీ కళాక్షేత్రం ఆధ్వర్యంలో ఈనెల 19వ తేదీ రాత్రి 7 గంటలకు సీక్యాంప్ కళాక్షేత్రంలో సాంఘిక నాటకాల ప్రదర్శ ఉంటుందని కళాక్షేత్రం అధ్యక్షులు పత్తి ఓబులయ్య తెలిపారు. సినిమా, టీవీ, రంగస్థల నటీ నటుల కాంబినేషన్‌తో కర్నూలులో ఆరు సంవత్సరాల తరువాత సాంఘిక నాటక ప్రదర్శనలు ఏర్పాటు చేసినట్లు పేర్కొన్నారు. శ్రీ సాయి ఆర్ట్స్ – కొలకలకలూరు తెనాలి వారిచే నాటకాల ప్రదర్శన ఉంటుందన్నారు. రాత్రి 7 గంటలకు గమ్య స్థానాల వైపు, 8 గంటలకు ప్రేమతో నాన్న నాటకాలు ప్రదర్శిస్తారని తెలిపారు.

లింగ నిర్ధారణ పరీక్షలు చట్టరీత్య నేరం

జిల్లా మాస్ మీడియా అధికారి శ్రీనివాసులు

కర్నూలు(హాస్పిటల్): గర్భస్థ లింగనిర్ధారణ పరీక్షలు చట్టప్రకారం నేరమని జిల్లా మాస్ మీడియా అధికారి శ్రీనివాసులు అన్నారు. శుక్రవారం కేవీఆర్ ప్రభుత్వ మహిళా కళాశాలలో లింగవివక్ష నిర్మూలన, గర్భస్థ లింగనిర్ధారణ వ్యతిరేక చట్టం(పీసీ పీఎన్‌డీటీ యాక్ట్), ఆడపిల్లల ప్రాముఖ్యతపై అవగాహన కార్యక్రమం నిర్వహించారు. శ్రీనివాసులు మాట్లాడుతూ లింగనిర్ధారణ పరీక్షలు అరికట్టాలన్న ఉద్దేశ్యంతో ప్రభుత్వం పీసీ పీఎన్‌డీటీ చట్టాన్ని అమలులోకి తెచ్చిందన్నారు. సమాజంలో స్త్రీ, పురుషులు ఇద్దరూ సమానమేనని, స్త్రీ పురుషుల మధ్య ఎలాంటి వివక్షా ఉండకూడదన్నారు. ప్రస్తుతం అన్ని రంగాల్లోనూ స్త్రీలు పురుషులతో సమానంగా రాణిస్తున్నారని చెప్పారు. సీడీపీవో ఇందిరమ్మ మాట్లాడుతూ ఆడపిల్లను బ్రతుకనిద్దాం–ఆడపిల్లను చదవనిద్దాం అనే నినాదాన్ని అందరూ పాటించాలన్నారు. ఈ విషయమై విద్యార్థినులతో పాటు వారి కుటుంబసభ్యులు, బంధువులు అవగాహన పెంచుకోవాలని సూచించారు. కార్యక్రమంలో కళాశాల ప్రిన్సిపాల్ ఇందిరా శాంతి, ఎస్‌బీసీసీ డిస్ట్రిక్ట్ కో ఆర్డినేటర్ శ్రీనివాసులు, డిప్యూటీ డెమో చంద్రశేఖర్‌రెడ్డి, మహిళా పోలీస్ ఉమామహేశ్వరి తదితరులు పాల్గొన్నారు.



మాట్లాడుతున్న మాస్ మీడియా అధికారి శ్రీనివాసులు

సారా కేసులో మహిళ అరెస్టు

కర్నూలు: కర్నూలు వన్‌టౌన్ పోలీసు స్టేషన్ పరిధిలోని జొహరాపురం దర్గా వద్ద నాటుసారా విక్రయిస్తున్న అదే గ్రామానికి చెందిన సయ్యద్ మహబూబ్‌బీని శుక్రవారం పోలీసులు అదుపులోకి తీసుకున్నారు. ఆమె వద్ద నుంచి 2 లీటర్ల నాటుసారా రూ.800 నగదుతో పాటు మట్కా చీటీలు స్వాధీనం చేసుకున్నారు. ఈమె భర్త సయ్యద్‌బాషా మట్కా బీటర్‌గా వ్యవహరిస్తున్నాడు...భార్య అతనికి సహకరిస్తోంది. సయ్యద్‌బాషా ఇటీవలనే మట్కా కేసులో జైలుకు వెళ్లి బెయిల్‌పై విడుదలయ్యాడు. మళ్లీ భార్య మహబూబ్‌బీతో కలిసి మట్కా నిర్వహిస్తు అదనపు ఆదాయం కోసం సారా విక్రయాలు జరుపుతున్నట్లు సమాచారం అందడంతో ఒకటవ పట్టణ పోలీసులు దాడి చేయగా సయ్యద్‌బాషా పారిపోయాడు. భార్య మహబూబ్‌బీపై కేసు నమోదు చేసి రిమాండ్‌కు పంపినట్లు పోలీసులు తెలిపారు.

20న చనుగొండ్లలో క్రీడా పోటీలు

గూడూరు రూరల్: చనుగొండ్లలో శ్రీ నాగలింగేశ్వర స్వామి జాతర సందర్భంగా ఈ నెల 20వ తేదీన ఆటల పోటీలు నిర్వహించనున్నట్లు శుక్రవారం కో ఆప్షన్ సభ్యుడు దౌల ఒక ప్రకటనలో పేర్కొన్నారు. స్లో బైక్ రైడింగ్, పరుగుపందెం పోటీలు నిర్వహిస్తున్నామని, ఆసక్తి కలిగిన వారు పాల్గొనవచ్చునన్నారు.

కారుణ్య నియామకాలు

కర్నూలు(అగ్రికల్చర్): కారుణ్య నియామకాల కింద ఖాళీలు, రోస్టర్ అనుసరించి జిల్లా ట్రెజరీకి ఐదుగురు ఆఫీసు సబార్డినేట్‌లను కేటాయించారు. వీరికి స్థానాలు కేటాయిస్తూ జిల్లా ట్రెజరీ డిప్యూటీ డైరెక్టర్ రామచంద్రరావు ఉత్తర్వులను అందచేశారు. జిల్లా ట్రెజరీకి నాగార్జున, కర్నూలు డివిజన్ సబ్ ట్రెజరీకి సునీత, మాధవీ బాయి, బనగానపల్లె సబ్ ట్రెజరీకి బి.మురళీకృష్ణుడు, నందికొట్కూరు సబ్ ట్రెజరీకి జి.వసంత్‌లను ఆఫీసు సబార్డినేట్‌లుగా నియమించారు.

మధ్యాహ్న భోజనంలో నాణ్యత తప్పనిసరి



గడివేముల జెడ్పీ హైస్కూల్‌లో మధ్యాహ్న భోజనాన్ని పరిశీలిస్తున్న డిప్యూటీ డీఈఓ

గడివేముల: ప్రభుత్వ పాఠశాలల్లో విద్యార్థులకు అందిస్తున్న మధ్యాహ్న భోజనంలో నాణ్యత ప్రమాణాలను తప్పనిసరిగా పాటించాలని డిప్యూటీ డీఈఓ మహమ్మద్ బేగ్ సూచించారు. శుక్రవారం మండల కేంద్రం జెడ్పీహైస్కూల్‌లో మధ్యాహ్న భోజన పథకం అమలును తనిఖీ చేశారు. మెనూ ప్రకారం భోజనం అందిస్తుండటంతో నిర్వాహకులను అభినందించారు. అనంతరం డిప్యూటీ డీఈఓ మాట్లాడుతూ మధ్యాహ్న భోజనంలో నాణ్యమైన కూరగాయలు ఉపయోగించాలన్నారు. అనంతరం విద్యార్థులతో కలిసి ఆయన భోజనం చేశారు. తర్వాత ఉపాధ్యాయులతో మాట్లాడుతూ విద్యార్థులకు అర్థమయ్యే రీతిలో విద్యాబోధన చేయాలని సూచించారు. ఈ కార్యక్రమంలో హెచ్‌ఎం దస్తగిరమ్మ పాల్గొన్నారు.

అంగన్‌వాడీ కేంద్రం తనిఖీ

కల్లూరు: అంగన్‌వాడీ కేంద్రాల్లో పిల్లలకు ప్రభుత్వం నిర్దేశించిన మెనూ ప్రకారం భోజనం వడ్డించాలని ఐసీడీఎస్ పీడీ కేఎల్ఆర్‌కే కుమారి అన్నారు. శుక్రవారం కల్లూరులోని అంగన్‌వాడీ కేంద్రాన్ని ఆమె తనిఖీ చేశారు. పూర్వప్రాథమిక కార్యక్రమాల అమలు, పిల్లల బరువు, ఎత్తును పరిశీలించారు. అనంతరం ఆమె మాట్లాడుతూ పిల్లలు వారి వయస్సుకు తగ్గ ఎత్తు, బరువు ఉండాలన్నారు. పిల్లలకు పోషకాహార లోపం లేకుండా చూసుకోవాలన్నారు. ప్రతి రెండు గంటలకు ఒక్కసారి రోజుకు ఎనిమిదిసార్లు ఆహారం అందించాలని సూచించారు. గర్భిణులు, అంగన్‌వాడీ కేంద్రాల్లోనే భోజనం చేసేలా ప్రోత్సహించాలన్నారు.

పంటలను వందశాతం నమోదు చేయాలి



సి.బెళగల్‌లో వ్యవసాయ సిబ్బందితో మాట్లాడుతున్న ఏడీఏ సాలురెడ్డి

సి.బెళగల్: రబీ పంటల నమోదు వంద శాతం జరగాలని కర్నూలు ఏడీఏ సాలురెడ్డి అన్నారు. శుక్రవారం మండల కేంద్రం సి.బెళగల్‌లోని వ్యవసాయ కార్యాలయంలో సాంకేతిక వ్యవసాయ అధికారి దస్తగిరితో కలిసి మండల వ్యవసాయ అధికారి (ఏఓ) మల్లేష్‌కుమార్, అధికారులు, సిబ్బందితో సమీక్ష సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ, ఈనెల 18వ తేదీలోగా వంద శాతం పంట నమోదు పూర్తి చేయాలన్నారు. అదేవిధంగా పీఎం కిసాన్ లబ్ధిదారులకు సంబంధించి రైతులతో ఈ – కేవైసీని పూర్తి చేయాలని ఆయన వ్యవసాయ సిబ్బందిని ఆదేశించారు. వ్యవసాయ సిబ్బంది ప్రతిరోజు గ్రామాల్లో రైతులకు అందుబాటులో ఉండి, వారికి అవసరమైన ఎరువులు, మందులు, విత్తనాలు సకాలంలో అందజేయాలన్నారు. సమీక్షలో వ్యవసాయ అధికారులు (ఏఈఓలు) రాణి, మధుసుదన్, ఎంపీఈఓలు, సచివాలయాల వ్యవసాయ సహాయకులు ఉన్నారు.

వలంటీర్లు సేవాభావంతో పనిచేయాలి



మారందొడ్డిలో వలంటీర్లతో మాట్లాడుతున్న ఎంపీడీఓ రాముడు, ఈఓఆర్డీ సందీప్

సి.బెళగల్: గ్రామ వలంటీర్లు సేవాభావంతో పనిచేయాలని ఎంపీడీఓ రాముడు అన్నారు. శుక్రవారం మండల పరిధిలోని మారందొడ్డి గ్రామంలో ఈఓఆర్డీ సందీప్‌తో కలిసి పర్యటించారు. అక్కడ గ్రామస్తులతో మాట్లాడి సమస్యలను, వారి అవసరాలను అడిగి తెలుసుకుని నమోదు చేసున్నారు. అనంతరం స్థానిక పాఠశాలలో గ్రామ వలంటర్లు, పారిశుద్ధ్య కూలీలతో సమీక్ష సమావేశం నిర్వహించి మాట్లాడారు. ప్రభుత్వం అందజేస్తున్న సంక్షేమ పథకాలు అర్హులైన ప్రజలందరికీ అందజేయాలని సూచించారు. వలంటీర్లు తమ విధులపట్ల నిర్లక్ష్యం వహిస్తే చర్యలు తప్పవని హెచ్చరించారు. ఆయుష్మాన్ భారత్ సర్వేను త్వరగా పూర్తి చేయాలన్నారు. గ్రామాల్లో పారిశుద్ధ్య పనులు మెరుగు పర్చాలని చెప్పారు. వీరివెంట పంచాయతీ కార్యదర్శి ఖాజాహుసేన్ ఉన్నారు.

వెన్నపూస రవీంద్రారెడ్డిని గెలిపించండి



సచివాలయ సిబ్బందికి ఓటు అభ్యర్థిస్తున్న ఎమ్మెల్యే డాక్టర్ సుధాకర్

గూడూరు: పట్టభద్రుల ఎమ్మెల్సీ ఎన్నికల్లో వైఎస్సార్‌సీపీ బలపరిచిన అభ్యర్థి వెన్నపూస రవీంద్రారెడ్డిని గెలిపించాలని ఎమ్మెల్యే డాక్టర్ సుధాకర్ కోరారు. శుక్రవారం ఆయన స్థానిక 6 సచివాలయాల సిబ్బందిని కలిసి ఎన్నికల ప్రచారం నిర్వహించారు. ఎమ్మెల్సీ ఎన్నికల్లో వైఎస్సార్‌సీపీ అభ్యర్థులకు మొదటి ప్రాధాన్యత ఓటు వేసి గెలిపించాలని కోరారు. ఎమ్మెల్యే వెంట స్థానిక మున్సిపల్ చైర్మన్ జులుపాల వెంకటేశ్వర్లు, వైస్ చైర్మన్లు పీఎస్ అస్లామ్, బోయ లక్ష్మన్న, వైఎస్సార్‌సీపీ పట్టణ కమిటీ కన్వీనర్ జె.ఆబేలు, వక్ఫ్ బోర్డు మెంబర్ ఎస్ఏ జిలానీ, కౌన్సిలర్లు ఖలీలు, నంద కిషోర్, టీచర్ కిషోర్, కుమార్, మద్ది, బండి రాజు, తదితరులు ఉన్నారు.